క్లుప్తంగా

నేడు మాఘ ఆదివారం తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో భావనారాయణ స్వామి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాస తిరునాళ్లు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. మూడో ఆదివారం భావనారాయణ స్వామి వారు వెలసిన రోజు కావడంతో భక్తులు భారీగా తరలివస్తారని భావించి దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణారావుపేట కృష్ణమూర్తివారివీధిలోని శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలంకరణ, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 11. 30 స్వామి వారి దివ్య కల్యాణం, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సనాతన సంప్రదాయం శ్రీవారి కోల సంబరం


జపయజ్ఞ పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: కుటుంబ సమేతంగా తిరుమల యాత్ర చేసి తలనీలాలు సమర్పించి ఆరాధకులు వారి ఇంటి ముంగిట పవిత్ర దీపారాధనతో రాత్రి నుంచి తెల్లవారే వరకూ కోల సంబరం నిర్వహించడం శ్రీవారి భక్తుల సంప్రదాయమని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం భోగిగణపతి పీఠంలో శ్రీవారి 72 జపయజ్ఞ పారాయణ నిర్వహించారు. 108 వారాల పారాయణ అనంతరం అక్టోబర్ నెలలో తిరుమల బస్సు యాత్ర శ్రీవారి దివ్య కల్యాణం, కోలసంబరం, మహా అన్నసమారాధన పీఠంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

మార్కెట్‌లోకి సుజుకి న్యూ యాక్సెస్ 125


సుజుకి న్యూ యాక్సెస్ స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న రాజారావు తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): స్థానిక భానుగుడి సెంటర్‌లోని షోరూంలో శనివారం సుజుకి న్యూ యాక్సెస్ 125 సీసీ స్కూటర్‌ను సుజుకి ఏరియా మేనేజర్ బాలకృష్ణ, షోరూం జీఎం రాజారావు మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంటిపూడి సుజుకి జీఎం రాజారావు మాట్లాడుతూ ద్విచక్రవాహన రంగంలో సుజుకీకి ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. ఈ స్కూటీ అన్ని వర్గాలతో పాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఈ స్కూటీ డ్రైవింగ్‌కు సులువైందని, నాణ్యతలో సాటిలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కరప: మండలం వేములవాడ, వాకాడ, వేళంగి, కూరాడ, కరప గ్రామాల్లో శనివారం కూటమి నాయకులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఉంటేనే ఇల్లు

- కూటమి ప్రభుత్వంలో మెలిక
- పీఎంఏవైకి వర్తింపు కొందరికే
- గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు


గత ప్రభుత్వ హయాంలో సమకూర్చిన స్థలంలో నిర్మించిన ఇల్లు

కాకినాడ: పేదల సొంతింటి కలలు సాకారమయ్యే పరిస్థితి నేడు కనిపించడం లేదు. నిలువ నీడలేని పేదలు ఇల్లు సమకూర్చుకోవాలంటే సొంత స్థలం ఉంటేనే సాధ్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఆ మేరకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో మంజూరైన కొత్త ఇళ్లకు ప్రభుత్వం పెట్టిన మెలిక పేదలకు నిరాశను మిగల్చనుంది. అనేక నిబంధనల పేరుతో నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం దూరం చేస్తోంది. కొత్తగా పెట్టిన నిబంధనలతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జరిగే ఇళ్ల నిర్మాణంపై జనం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జగన్ పాలనలో ఇలా..

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సరళతరం చేసి పేదల సొంతింటికల సాకారమయ్యేలా చేశారు. వేలాది ఎకరాల భూమిని సేకరించి లేఅవుట్ చేసి సకల మౌలిక సదుపాయాలు కల్పించి స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి శరవేగంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఒక్క కాకినాడ సిటీ నియోజకవర్గంలో 36 వేల మందికి పట్టాలు ఇచ్చి 20 వేలకు పైగా ఇళ్ల నిర్మాణానికి బీజం వేశారు. నిర్మాణ దశలో ఉన్న పలు ఇల్లు ఎన్నికలు రావడంతో నత్తనడకన సాగాయి.

నత్తనడకన పాత ఇళ్లు

పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఇళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఒక్క కొమరగిరి లే అవుట్‌లో 16 వేల ఇళ్లు మంజూరు కాగా, దాదాపు 9 వేల ఇళ్ల కోసం గ్రౌండింగ్ చేశారు. ప్రభుత్వం మారడంతో నాటి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణంపై కొత్త ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది. దీంతో ఇళ్ళ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గృహ నిర్మాణ ప్రోత్సాహాన్ని ప్రస్తుతం రూ.2.5 లక్షలకు పెంచినప్పటికీ నిజమైన, అర్హత కలిగిన లబ్ధిదారులకు ఏ మాత్రం న్యాయం జరగడంలేదంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో ఇచ్చిన సెంటు స్థలానికి పీఎంఏవై పథకాన్ని వర్తింపచేయడంలో సాంకేతిక అవరోధాలను చూపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణ చేసి స్థలాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో కేవలం సొంత స్థలాలు ఉన్నవారికి మాత్రమే ఇళ్ళు నిర్మించుకునే వెసులుబాటు ఇచ్చారు. మొత్తం మీద ప్రస్తుత ప్రభుత్వ హయాంలో స్థలం లేనివారికి ఇళ్లు కట్టుకునే యోగాన్ని దాదాపు దూరం చేసేశారు. కొమరగిరి లేఅవుట్‌లో గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్తున్నారు. పీఎంఏవై ఫేజ్-2లో మంజూరైన ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు.

అవాంతరాలు ఎన్నెన్నో..

గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాకినాడకు పీఎంఏవైలో దాదాపు 20వేల ఇళ్ళు మంజూరు కాగా, కూటమి ప్రభుత్వంలో కాకినాడకు కేవలం 940 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. వాటిని కూడా లబ్ధిదారులకు చేరకుండా అనేక నిబంధనలు పెట్టి సొంతింటి కల సాకారానికి మోకాలడ్డుతున్నారు. ఇందులో ప్రధానంగా సొంత స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆదేశాలతో గృహనిర్మాణ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. రూ.3 లక్షలు లోపు ఆదాయం కలిగి, సొంత స్థలం ఉండి గతంలో ప్రభుత్వం ద్వారా ఇంటి కోసం లబ్ధిపొందని వారికి మాత్రమే ఇప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఈ నిబంధన గృహ నిర్మాణ లబ్ధిదారులకు శాపంగా మారింది.

చెత్త శుద్ధితో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- నగరపాలక సంస్థ కమిషనర్ భావన
- తడి, పొడి చెత్త, వ్యర్థాల నిర్వహణపై 'సోర్స్-రిసోర్స్' థీమ్‌తో అవగాహన
- సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ భావన


కరపలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ

బోట్‌క్లబ్: చెత్తను వేరు చేసి, పారిశుధ్య సిబ్బందికి అందించి పర్యావరణాన్ని కాపాడేందుకు నగర ప్రజలు భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక శారదమ్మ గుడి సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. పొడి, తడి చెత్త, వ్యర్థాల నిర్వహణలో మూలాల విభజన అంశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శనివారం 'సోర్స్- రిసోర్స్' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వ్యర్థాల నిర్వహణ, చెత్తను వేరు చేసి వాటి ద్వారా ఏయే ఉత్పత్తి చేయవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. మూడు రకాల వ్యర్థాల నిర్వహణను చేపట్టవచ్చని, వ్యర్థాల నిర్వహణను అన్వేషించడం, తగ్గించడం, తిరిగి ఉపయోగించడం, రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయవచ్చని, చెత్త నుంచి వచ్చే మిథేన్ వాయువులను తయారు చేయవచ్చని, దానిని సీఎన్‌జీ గ్యాస్ మాదిరి వినియోగించుకోవచ్చునన్నారు. పొడి చెత్తను కూడా వేరు చేసి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించవచ్చన్నారు. ఇటీవల తాను మహారాష్ట్ర, పూణెకు వెళ్లి అక్కడ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించానని, అది 700 పీపీడీ ప్లాంట్ అని ప్రతి గంటకు 14 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని కమిషనర్ వివరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ వరకు జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

ఏటిమొగ అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రతీ ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు తడి, పొడి చెత్తను, ప్రమాదకర చెత్తలను వేరుచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి అన్నారు. స్థానిక ఏటిమొగ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు తడి చెత్తను ఇంట్లోనే ఎరువుగా మార్చుకొని పంటలు పండించుకోవాలన్నారు. అనంతరం మహిళలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి, సిబ్బంది నూకరత్నం, సుజాత, అన్నపూర్ణ, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కరప: గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ టి.అన్నామణి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావుతో కలసి నడకుదురులో పంచాయతీ, సచివాలయం సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. ఆ మేరకు గృహస్తులను సైతం చైతన్యపరిచారు. నెలలో మూడో శనివారం తప్పని సరిగా ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలను సిబ్బందితో కలసి శుభ్రం చేయాలన్నారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, ప్రజలతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు వేర్వేరుగా పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు అవగాహన కల్పించారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శి యు.నిర్మలదేవి సిబ్బందితో కల్సి గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.


ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో చెత్తను తొలగిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో..

కాకినాడ రూరల్: స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసరు కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత తీసుకోవాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ థీమ్ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసరు ప్రశాంతి కుమారి, ప్రొఫెసరు పోచయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె.హరిబాబు, డాక్టరు జోసెఫ్ స్టీఫెన్, డాక్టరు గోపి, హేమలత, మణికంతేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా అధికారులు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన కలెక్టరేట్ సిబ్బందితో కలిసి వివిధ విభాగాలు, పౌర సరఫరాలు, వికాస కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వ అధికారులు నిత్యం కార్యకలాపాలు నిర్వహించే తమ కార్యాలయాలు, ఆవరణలోని ఖాళీ ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. దీని ద్వారా కార్యాలయాల్లోకి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఏవో రామమోహన్‌రావు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో వెంకటరావు

పన్ను బకాయిలు వసూలు చేయండి

బోట్‌క్లబ్: మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి, పన్ను వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆమె రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్లతో వసూళ్లపై సమీక్షించారు. రూ.కోట్ల మేర పేరుకుపోయిన మొండి బకాయిలపై దృష్టి సారించాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి బకాయిలను పూర్తిగా వసూలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లదేనన్నారు. వెంటనే బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని, మొండికేసే వారి తాగునీటి కుళాయిలు కట్ చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు అందించడంతో పాటు, అవసరమైతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

కరప: వివాహ వేడుకకు హాజరైన ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును చైన్ స్నాచర్ అపహరించుకు పోయిన ఘటన మండలం నడకుదురులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా డొంకాడ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన వెలమల నాగమణి కరప మండలం నడకుదురులోని బంధువు బొంగు నాగభూషణరావు వివాహానికి వచ్చారు. స్థానిక వెలమ సంక్షేమ భవనంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి, 11 గంటల సమయంలో నాగమణి తన తల్లితో కలిసి పెండ్లి కుమారుని ఇంటికి వెళ్తుండగా మాస్క్ ధరించిన చైన్ స్నాచర్ మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. స్థానికులు, బంధువులు స్పందించి వెంబడించినా దొంగ తప్పించుకుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి దశ నుంచి రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందింపజేయడానికి మొదటి సారిగా భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎన్ విద్యా సంస్థల డైరెక్టర్ మతుకుమిల్లి విజయ్ శనివారం తెలిపారు. పరీక్ష రెండు కేటగిరీలుగా విభజించి నిర్వహిస్తున్నామని, 13 నుంచి 15 సంవత్సరాల వారికి ఒకటి, 15 నుంచి 18 ఏళ్లవారిని మరొక కేటగిరీగా విభజించామన్నారు. పరీక్షకు ఏ విధమైన రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని సూచించారు. పరీక్షకు హాజరయ్యేవారు 98857 76555 నెంబరుకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌కు అభినందన


కమాండెంట్ నాగేంద్రను అభినందిస్తున్న సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ముద్రగడ నాగేంద్రరావును తిమ్మాపురం సర్పంచ్, జేఎన్టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు బెజవాడ వీర వెంకట సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా విధులు నిర్వహించి, ఆక్టోపస్ కమాండెంట్‌గా వెళ్లి, మళ్లీ ఇదే బెటాలియన్‌కి కమాండెంట్‌గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

వచ్చే నెలలో టార్క్-25 సింపోజియం


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ తదితరులు

బాలాజీచెరువు: యూసీఈకే మెకానికల్ ఇంజినీరింగ్, స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో మార్చి 15, 16 తేదీల్లో జేఎన్‌టీయూకేలో టార్క్-25 సింపోజియం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ టెక్నికల్ సింపోజియంలో భాగంగా బ్రిడ్జి బిల్డింగ్, లేత్ మాస్టర్, రోబో రేస్, డిజైన్ థ్రీక్, మోనార్క్, మెకానికల్ క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్, సాంకేతిక అంశాలపై పట్టు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి లింగరాజు, ప్రిన్సిపాల్ మోహనరావు, కో-ఆర్డినేటర్లు మీరా సాహెబ్, జయప్రసాద్, కళ్యాణ్ మనోహర్ పాల్గొన్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

కరప: మండలం యండమూరులో జరిగిన కత్తి దాడి కేసులోని నిందితుడికి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల మేరకు ఆ గ్రామంలోని వేంకటేశ్వరుని రథోత్సవంలో కుడిపూడి ఈశ్వరప్రసాద్, మారెళ్ల అజయ్ మధ్య ఘర్షణ జరిగి కత్తిపోట్లకు దారితీసిన విషయం తెలిసిందే. కాగా ఈఘర్షణలోని నిందితుడు అజయ్‌ను అరెస్ట్ చేసి, శనివారం కాకినాడలోని స్పెషల్ జేఎఫ్‌సీఎం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచారు. మెజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి సహకరించిన అజయ్ స్నేహితుల కోసం గాలిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పోలీసు పహారాలో యండమూరు

మండలం యండమూరులో రెండు సామాజిక వర్గాల మధ్య అల్లర్లు జరగకుండా పోలీసు పహారా ఏర్పాటుచేశారు. సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. శుక్రవారం రాత్రి సీఐ గ్రామంలో పర్యటించి ఇరు వర్గాలు సంయమనం పాటించాలని, అల్లర్లు సృష్టించినా, ప్రోత్సహించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా వీధులకు చెందిన పెద్దలతో పీస్ కమిటీలు ఏర్పాటుచేసి శాంతి భద్రతలు కాపాడాలని సూచించారు. ఎస్ఐలు టి.సునీత, ఆర్‌వీఎస్ మూర్తి సిబ్బందితో కల్సి పరిస్థితిని గమనిస్తున్నారు.


యండమూరులో పహారా కాస్తున్న పోలీస్ సిబ్బంది

పెట్టకుంటే హెల్‌మెట్టెక్కినట్టే!

- హెల్మెట్ ధారణ వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబానికీ జీవనాధారం
- రహదారి ప్రమాద మరణాల్లో దీనిని ధరించనివారే ఎక్కువ మంది
- పోలీసు, రవాణా శాఖల సదస్సులకు స్పందన కరవు
- పెద్దలు, పిల్లలూ అదే తీరు

పెద్దాపురం: హెల్మెట్ ధరించడాన్ని భారంగా భావిస్తూ రోడ్డుపై పోలీసులు కనిపిస్తే తప్పించుకుని పోవడం అక్కడక్కడా చూస్తూనే ఉంటాం. హెల్మెట్ ధరించమనేది ప్రయాణికుల భద్రత కోసమేననే విషయాన్ని వాహన చోదకులు గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దానిని నిర్లక్ష్యం చేస్తూ ఆనందమయ జీవితాన్ని విషాదాంతం చేసుకుంటున్నవారు ఎందరో. బతుకు బండి ఈడ్చేవారిని కోల్పోయి రోడ్డున పడుతున్నవారెందరో మన కళ్ల ముందే కనిపిస్తున్నా కనీసం చైతన్యం కలగకపోవడం ఎంతో బాధాకరం.


హెల్మెట్ ధారణపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మౌనిక

కీలక నిర్ణయాలు

ఇటీవల జాతీయ భద్రత, రహదారి వారోత్సవాల సభల్లో హెల్మెట్ వినియోగాన్ని తప్పని సరి చేస్తూ పోలీస్, రవాణా శాఖలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రహదారి ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా ఈ తీర్మానాన్ని తీసుకున్నారు.

యువతే అధికం

అతివేగం యువతను బలితీసుకుంటోంది. పోలీస్ రికార్డుల ప్రకారం హెల్మెట్ లేకపోవడం వల్లే అధిక శాతం యువత ప్రమాదాల బారినపడి మరణిస్తున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను అతి గారాబం చేస్తూ అధిక ఇంజిన్ సామర్థ్యం (సీసీ) ఉన్న ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. మైనర్లు సైతం అతివేగంగా వాహనాలు నడుపుతూ నిండు ప్రాణాల్ని సమర్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడేళ్ల వ్యవధిలో 850 మంది రహదారి ప్రమాదాల్లోనే మరణించగా, వారిలో హెల్మెట్ లేనివారే అధిక సంఖ్యలో ఉన్నారని పోలీసులు చెప్తున్నారు.

కారణాలివే..

- రహదారి మలుపులలో సైతం అదుపు తప్పుతుందనే భయం లేకుండా వేగంగా వెళ్లడం.
- జాగ్రత్తలు పాటించకపోవడం.
- ట్రాఫిక్ సిగ్నల్స్‌ను విస్మరించడం.
- ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు, నలుగురు నిర్లక్ష్యంగా ప్రయాణించడం.
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్.
- సెల్ మాట్లాడుతూ వాహనం నడపడం.
- మైనర్లు, లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం.
- నైపుణ్యం లేని డ్రైవింగ్, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగస్తులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎంవీఎస్ ప్రసూన, గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, శ్రీవాణి, సునీత, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ.4.44 లక్షల ఆదాయం

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.4,44,291 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 10 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వారి దర్శనానికి వెళ్తున్న భక్తులు